

'ఉగ్రం' ఆలోచింపజేస్తుంది
ఉగ్రం సినిమా చాలా విషయాల్లో అందరినీ ఆలోచింపజేస్తుందని సినిమా కథా రచయిత, జహీరాబాద్ వాసి తూము వెంకట్ అన్నారు.

8లో



సైబర్ వలలో చిక్కి..
రోజురోజుకు సైబర్ వలలో చిక్కుకుంటున్న వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. పోలీసులు అవగాహన కల్పిస్తున్నప్పటికీ పలువురు మోసపోతూనే ఉన్నారు.

8లో



గుంతలు.. ఆపై దుమ్ము లేస్తూ
మెదక్-బొడ్మట్‌పల్లి రూట్‌లో ప్రయాణమంటేనే హడలిపోతున్నారు. రోడ్డు శిథిలమవుతుండడంతో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

9లో

న్యూస్‌రీల్

తనిఖీల్లో జాప్యం సరికాదు



మాట్లాడుతున్న శ్రీధర్‌గుప్తా

నర్సాపూర్: క్వాలిటీ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్ మెదక్ నుంచి ఇక్కడికి రోజు రావడం లేదని.. ఆయన వారానికి ఒకటి, రెండుసార్లు రావడంతో బియ్యం నాణ్యత తనిఖీల్లో జాప్యం జరిగి లారీల నుంచి బియ్యం అన్‌లోడ్ చేయడం లేదని నర్సాపూర్ రైస్‌మిల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పైడి శ్రీధర్‌గుప్తా ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. మార్కెట్ కమిటీ గోదాంలో ఖాళీ ఉన్నప్పటికీ లారీల్లో వచ్చిన బియ్యం బస్తాలను వెంట వెంటనే ఖాళీ చేయడం లేదన్నారు. బియ్యం నాణ్యత తనిఖీల పేరిట రోజుల తరబడి లారీలను ఆపడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. లారీల్లో బియ్యం తెచ్చి రోజుల తరబడి అన్‌లోడ్ కోసం ఎదురు చూస్తున్నామని పలువురు లారీల డ్రైవర్లు వాపోయారు.

దరఖాస్తుల ఆహ్వానం



మెదక్‌కలెక్టరేట్: అనాథ పిల్లలు, తల్లిదండ్రులు లేని బాల బాలికలకు హాస్టల్ వసతితో విద్యా బోధన చేసేందుకు నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్ నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారిణి విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి గానూ మహిళా శిశు సంక్షేమ శాఖ లేదా జువైనల్ జస్టిస్ కేర్, ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ యాక్ట్ 2015 నుంచి సర్టిఫికెట్‌తో అనుమతి పొందిన ఆసక్తి గల నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్లు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈనెల 9వ తేదీలోగా దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

నేడు నర్సాపూర్‌లో కవి సమ్మేళనం

నర్సాపూర్: మేడే వారోత్సవాల్లో భాగంగా ఈనెల 4వ తేదీన పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో శ్రామిక కవి సమ్మేళనం ఏర్పాటు చేశామని సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ తెలిపారు. నియోజకవర్గంలోని కవులు పాల్గొని సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మాటలకే పరిమితం



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): వడగండ్ల వర్షంతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం మాటలకే పరిమితం అయిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయిపల్లి గోపి, నర్సాపూర్ నియోజకవర్గ కన్వీనర్ మల్లేశ్‌గౌడ్ ఆరోపించారు. బుధవారం మండల పరిధిలోని శంకర్, బీమ్లా తండాలతో పాటు పాంబండ గ్రామాల్లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రవిగౌడ్, నాయకులు అశోక్ సాదుల, హరిగౌడ్, రహీంఖాన్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోండి



లక్కీడ్రా నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

మెదక్ కలెక్టరేట్: నిరుపేద గిరిజన విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ బేగంపేట, రామంతాపూర్ పాఠశాలలకు 1వ తరగతిలో ఆరుగురు విద్యార్థుల ఎంపిక కోసం లక్కీడ్రా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారిణి విజయలక్ష్మి, డీఈఓ రాధాకిషన్, జిల్లా గిరిజన ఆశ్రమ పాఠశాలల హెచ్‌ఎంలు యాదయ్య, జయరాజ్, లలితాబాయి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పూరి గుడిసె ఆవాసం

గృహలక్ష్మికి ముహూర్తం ఎప్పుడో? | **పేదలకు తప్పని ఎదురుచూపులు**



ఈచిత్రంలో కనిపిస్తున్న ముగ్గురు గిరిజన మహిళలు అనిత, బూలి, లచ్చిమి హవేళిఘనపూర్ మండలం ఔరంగాబాద్ గిరిజన తండాకు చెందిన వారు. తండాలో 15 నివాస గృహాలు ఉండగా ఐదు పెంకుటిళ్లు ఉన్నాయి. మిగితా పది పూరి గుడిసెలే. ఇటీవల ఈదురుగాలులతో కూడిన వర్షానికి గుడిసెలపై ఉన్న గడ్డి, టాపర్లు కొట్టుకుపోవడంతో రాత్రి వేళలో బిక్కుబిక్కుమంటూ పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాలలో తలదాచుకున్నారు.



హవేళిఘనపూర్ మండలం ఔరంగాబాద్ గిరిజన తండాలోని పూరి గుడిసెలు

మెదక్‌జోన్: జిల్లాలో మెదక్, నర్సాపూర్ రెండు నియోజకవర్గాలు ఉండగా.. ఇందులో 21 మండలాలు ఉన్నాయి.

- ప్రభుత్వం ఇళ్లు లేని పేదలందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పడంతో ఆశపడ్డారు.
- కాగా ఇప్పటివరకు కేవలం 900 మందికి మాత్రమే డబుల్ బెడ్రూం ఇళ్లు దక్కాయి.
- ప్రభుత్వం సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుంటే గృహలక్ష్మి పథకం కింద మంజూరు చేస్తామని.. ఒక్కో ఇంటికి రూ. 3 లక్షలు ఇస్తామని ప్రకటించింది.
- ప్రతీ నియోజకవర్గానికి గృహలక్ష్మి పథకం కింద 3 వేల యూనిట్లు ఇస్తామని ప్రకటించగా లబ్ధిదారుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి.
- ఒక్కో ఇంటికి రూ.3 లక్షల చొప్పున మూడు విడతల్లో అర్హులకుడబ్బులు చెల్లిస్తామని చెప్పింది.
- మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో ఆరు వేల ఇళ్లు రానుండగా.. ఇందుకు గానూ రూ. 180 కోట్ల ఖర్చు అవుతుందని అంచనా వేశారు.

వర్షాలతో గిరిజనుల అవస్థలు

- తండాల్లో ఇళ్లు లేకుండా ఇబ్బంది పడుతున్న గిరిజనులు అధికంగా ఉన్నారు.
- వారం పది రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు చిన్న పిల్లలను తీసుకుని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్లలో తలదాచుకుంటున్నారు.
- జిల్లాలో 469 గ్రామాలు ఉండగా వాటిలో 216 గిరిజన తండాలు ఉన్నాయి. తండాల్లో 70 శాతం మంది నేటికీ పూరి గుడిసెల్లోనే నివాసం ఉంటున్నారు.
- ప్రజావాణిలో ఇళ్ల మంజూరు కోసం ప్రజలు ఇబ్బడిముబ్బడిగా దరఖాస్తు చేసుకుంటున్నారు.
- ఇటీవల అసెంబ్లీలో సీఎం కేసీఆర్ సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునే వారికి రూ. 3 లక్షలు ఇస్తామని చెప్పడంతో ఆశగా ఎదురు చూస్తున్నారు.

900 మందికి మాత్రమే 'డబుల్' ఇళ్లు

- జిల్లావ్యాప్తంగా ప్రభుత్వం 4,790 డబుల్ బెడ్రూం ఇళ్లను మంజూరు చేసింది. వాటిలో 3,640 ఇళ్ల నిర్మాణ పనులు మాత్రమే ప్రారంభించారు.
- వాటిలో ఇప్పటివరకు పూర్తి అయినవి 2,440 కాగా లబ్ధిదారులకు పంపిణీ చేసింది మాత్రం కేవలం 900 ఇళ్లు మాత్రమే.
- మిగితావి త్వరలో పంపిణీ చేస్తామని అధికారులు చెబుతున్నారు. గడిచిన తొమ్మిదేళ్లలో ఇప్పటివరకు 900 మందికి మాత్రమే ఇళ్లు లభించాయి.

ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెరిగింది

మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



మనవడికి టీకా వేయిస్తున్న పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్‌మున్సిపాలిటీ: ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు నమ్మకం పెరిగిందని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం తన మనవడికి పట్టణంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్)లో టీకా ఇప్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వ ఆస్పత్రులు సమస్యలకు నిలయంగా ఉండేవన్నారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం సీఎం కేసీఆర్ ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రత్యేక దృష్టి పెట్టారని చెప్పారు. ఆస్పత్రుల స్థాయి పెంచడంతో పాటు కోట్లాది రూపాయలు వెచ్చించి అత్యాధునిక యంత్రాలు, పరికరాలు సమకుర్చారన్నారు. జిల్లా కేంద్రాల్లో ప్రత్యేకంగా అన్ని హంగులతో మాతా శిశు సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. కేసీఆర్ కిట్‌తో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. వైద్యారోగ్య శాఖ మంత్రిగా హరీశ్‌రావు బాధ్యతలు తీసుకున్న తర్వాత జిల్లాలో ప్రభుత్వ పరంగా వైద్య సేవలు మెరుగు పరచడంపై ప్రత్యేక ఫోకస్ పెట్టారని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఐదో వార్డులో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్, వైద్యులు డాక్టర్ శివదయాల్, తిరుమలేశ్ పాల్గొన్నారు.

'కంటి వెలుగు'కు మంచి స్పందన



శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

నర్సాపూర్‌రూరల్: జిల్లాలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలకు మంచి స్పందన వస్తుందని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం మండలంలోని నారాయణపూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. జిల్లాలో 373 గ్రామ పంచాయతీలు, 65 వార్డుల్లో కంటి వెలుగు శిబిరాలు నిర్వహించి 3,73,358 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించామని తెలిపారు. 40,853 మందికి రీడింగ్ అద్దాలు, 33,045 ప్రిస్క్రిప్షన్ అద్దాలు పంపిణీ చేశామన్నారు. ప్రస్తుతం 25 గ్రామ పంచాయతీలు, 4 మున్సిపల్ వార్డుల్లో కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు. అన్ని శాఖల సమన్వయంతో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాలను జూన్ 15 వరకు నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం మండలంలోని లింగాపూర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ చందూనాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయనిర్మల, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి బ్రహ్మాజీ, ఆశవర్కర్లు, తదితరులు ఉన్నారు.

అన్ని రంగాల్లో ప్రభుత్వం విఫలం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

మెదక్ కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ విమర్శించారు. బుధవారం కలెక్టరేట్ వద్ద జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జేపీఎస్‌లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జేపీఎస్‌లకు ఇచ్చిన హామీని బేషరతుగా అమలు చేయాలన్నారు. పల్లెల అభివృద్ధిలో భాగస్వాములైన జేపీఎస్‌లను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నల్లాల విజయ్ కుమార్, ఎక్కలదేవి మధు, నాయిని ప్రసాద్, మల్లేశం, రాజు, సతీష్, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల జిల్లా అధ్యక్షుడు కుమార్ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గరుడ గంగ పుష్కరాలు



మంజునాథ స్వామికి అభిషేకం చేస్తున్న భక్తులు

మెదక్ రూరల్: మండలంలోని పేరూరు శివారులోని సరస్వతీ ఆలయం వద్ద అత్యంత వైభవోపేతంగా కొనసాగిన గరుడ గంగా మంజీర పుష్కరాలు దిగ్విజయంగా ముగిశాయి. బుధవారం చివరి రోజు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పుష్కర స్నానాలు ఆచరించి సరస్వతీ మాతను దర్శించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, హోమాలు, మంజునాథ స్వామికి అభిషేకాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పుష్కర ఘాట్‌లో పుణ్యస్నానాలు చేసి గంగమ్మకు పసుపు, కుంకుమతో వాయినాలు సమర్పించి శ్రాద్ధ కర్మ పిండ ప్రధానం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ పుష్కర ఘాట్‌లో పుణ్య స్నానం చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

సాక్షి విద్యార్థులకు వేసవి శిబిరం



'సాక్షి' మీడియా గ్రూప్ ఈనెల 6వ తేదీ నుంచి 8 వరకు సిద్ధార్థ్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించనుంది. ఇందులో 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు డ్రాయింగ్, చెస్ క్రీడల్లో ఉచితంగా శిక్షణ ఇస్తారు.

వేదిక: సిద్ధార్థ్ విజ్డమ్ స్కూల్, వెంకటేశ్వర కాలనీ, ఎస్‌బీహెచ్ వెనకాల మెదక్

సమయం: ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

వివరాలు, పేర్ల నమోదుకు **9490449283** నంబర్ లేదా పాఠశాలలో సంప్రదించాలి

పంట నష్టం వివరాలు అందజేయాలి

కలెక్టర్ రాజర్షిషా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: అకాల వర్షాలతో జరిగిన పంట నష్టం సర్వే వివరాలను రెండు రోజుల్లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో పంటనష్టం, ధాన్యం కొనుగోళ్లు, దళితబంధు, వైకుంఠ ధామాల నిర్వహణ, క్రీడా ప్రాంగణాలు, సంపద వనాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షం తగ్గినందున ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. కేంద్రం నిర్వాహకులు రైతులను ఇబ్బంది పెట్టకుండా తేమశాతం కొంత ఎక్కువ ఉన్నా తూకం వేసి వెంటనే లారీల ద్వారా ధాన్యం మిల్లులకు చేరవేయాలన్నారు. ట్యాబ్ ఎంట్రీ త్వరగా చేస్తూ రైతులకు 48 గంటల్లో డబ్బులు పడేలా చూడాలన్నారు. రైతులు సంయమనం పాటించాలని, ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని భరోసా కల్పించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో 40,563 ఎకరాల్లో వరి, పండ్ల తోటలు దెబ్బతిన్నాయని వెల్లడించారు. దళిత బంధు కింద పౌల్ట్రీఫాం యూనిట్లు అన్ని గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే జిల్లాలో నిర్మించిన వైకుంఠధామాలు అన్ని వినియోగంలో ఉండేలా చూడాలన్నారు. మన ఊరు– మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రగతిలో ఉన్న 219 పనులను వేగవంతం చేయాలని.. ఇంకా ప్రారంభించని 397 పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వారం రోజుల్లోగా మిగిలిన 41 తెలంగాణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సంపద వనాలు ఏర్పాటుకు స్థల ఎంపికతో పాటు మొక్కల లభ్యత చూడాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ ఓడీఎఫ్ ప్లస్‌లో భాగంగా ప్రతి నెల 20 శాతం గ్రామ పంచాయతీలు ఐదు అంశాల్లో సుస్థిర ప్రగతి సాధించి ఆదర్శ గ్రామంగా ఎంపికయ్యేలా చూడాలని వివరించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆశాకుమారి, ఉద్యాన అధికారి నర్సయ్య, ఇతర జిల్లా అధికారులు వెంకట శైలేష్, రవి ప్రసాద్, శ్రీనివాస్, జెంలా నాయక్, కరుణ, విజయలక్ష్మి, బ్రహ్మాజీ, జయరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయండి

అదనపు కలెక్టర్ రమేశ్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రమేశ్

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో అకాల వర్షాలు తగ్గుముఖం పట్టాయని.. ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచి రైతులు నష్టపోకుండా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ రమేశ్ సూచించారు. బుధవారం ధాన్యం కొనుగోలు, రైస్ మిల్లుల్లో దిగుమతిపై బాయిల్డ్ రైస్ మిల్లర్లు, జిల్లా ఏజెన్సీ ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్, జిల్లా సహకార అధికారి కరుణను ఆదేశించారు. డబ్బుల చెల్లింపు త్వరగా చేయాలన్నారు. బాయిల్డ్ మిల్లర్లు తమ వద్ద ఉన్న హమాలీ సంఖ్యను పెంచుకొని వచ్చిన లారీలను వెంటనే ఖాళీ చేసి పంపాలన్నారు. అనంతరం ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. అకాల వర్షాలతో ధాన్యం కొనుగోలు ఆలస్యమైందని, కొనుగోలు వేగవంతం చేయాలని కోరారు. మిల్లర్లు వెంటనే లారీలు దిగుమతి చేసి కేంద్రాలకు ఆటంకం లేకుండా లారీలు తిప్పి పంపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైస్‌మిల్లర్ల సంఘం అధ్యక్షుడు చంద్రపాల్, డీఎస్‌ఓ శ్రీనివాస్, బాయిల్డ్ రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని



వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేస్తున్న ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని

పెద్దశంకరంపేట(మెదక్): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని తెలిపారు. బుధవారం 161వ జాతీయ రహదారి క్యూబ్ హైవేస్ ఆధ్వర్యంలో కోళపల్లి వద్ద ఏర్పాటు చేసిన ఉచిత హెల్మెట్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. హెల్మెట్ ధరించకపోవడంతో ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చలాన్లు వేస్తున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. గతేడాదిలో అత్యధికంగా రోడ్డు ప్రమాదంలోనే చాలా మృతి చెందారన్నారు. లక్షలు వెచ్చించి ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేస్తున్నా హెల్మెట్ మాత్రం ధరించడం లేదన్నారు. జాతీయ రహదారులపై అండర్‌పాస్‌లను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అల్లాదుర్గం సీఐ జార్జ్, క్యూబ్ హైవేస్ ప్రాజెక్ట్ హెడ్ ప్రభాకర్ రెడ్డి, ఆర్‌ఈ విజయరాజ్, ఎస్‌ఐలు బాలరాజు, ప్రవీణ్‌రెడ్డి, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే అంతే..

టార్పాలిన్లు లేక రైతుల అవస్థలు



నర్సాపూర్‌లోని ఓ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం

నర్సాపూర్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు లేవని.. వర్షం కురిస్తే వడ్లను ఎలా కాపాడుకోవాలని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో కొనుగోలు కేంద్రానికి ఐదు టార్పాలిన్లను మొక్కుబడిగా సరఫరా చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా సరఫరా చేసిన టార్పాలిన్లు రంధ్రాలు పడ్డాయని కేంద్రాల నిర్వాహకులు తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు ఇప్పటికే వడ్లను పెద్ద ఎత్తున తెచ్చి ఆరబెడుతున్నారు. టార్పాలిన్లు లేకపోవడంతో వర్షం కురిస్తే వడ్లు తడిసి ముద్దవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా మూడు రోజుల క్రితం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించగా.. చాలా కేంద్రాల్లో ఇంతవరకు తూకం ప్రారంభించలేదు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎండిన వడ్లను తూకం వేయడంతో పాటు అన్ని కేంద్రాలకు సరిపడా టార్పాలిన్లు సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు. ఈవిషయమై మండల ఐకేపీ ఏపీఎం గౌరిశంకర్‌ను వివరణ కోరగా తమ పరిధిలో ఏర్పాటు చేసిన కొన్ని సెంటర్లకు టార్పాలిన్లు సరఫరా చేశారని తెలిపారు. వాటిలో కొన్ని రంధ్రాలు పడ్డాయని.. అవి కూడా సరిపడా రాలేవని చెప్పాడు.

క్లుప్తంగా

తేనెటీగల దాడి

ఇద్దరు చిన్నారులకు గాయాలు

నారాయణఖేడ్: తేనెటీగల దాడిలో ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. నారాయణఖేడ్ పట్టణానికి చెందిన అంజయ్య తన మనవడు శంకర్, మనవరాలు సంజనను తీసుకొని టీవీఎస్ బైక్‌పై కామారెడ్డి జిల్లా ఆరేటి గ్రామానికి వెళ్తుండగా నిజాంపేట్ మండలం ర్యాలమడుగు సమీపంలో ఒక్కసారి తేనెటీగలు దాడిచేశాయి. దీంతో చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని నారాయణఖేడ్ ఏరియా ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం తరలించారు.

అక్రమంగా కుంట మట్టి తరలింపు



మట్టి తోడుతున్న జేసీబీ, ట్రాక్టర్లు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పరిధిలోని కుమ్మరి కుంట నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని గ్రామస్తులు బుధవారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఊరుశివారులో కుంటలో మట్టి తీయడం వల్ల పశువులు మేతకు వెలితే జేసీబీ కందకాల్లో పడి మృతి చెందే అవకాశం ఉందన్నారు. గతంలో ఇలాంటి ప్రమాదాలు జరిగాయని గుర్తుచేశారు. రెవెన్యూ అధికారులు స్పందించి అక్రమ మట్టి తవ్వకాలను అరికట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

సంగారెడ్డి మున్సిపాలిటీ: సంగారెడ్డి పట్టణ ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా ఉన్న జనరిక్ మెడికల్ స్టోర్ వద్ద గుర్తు తెలియని మృతదేహం లభించిందని ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి బుధవారం తెలిపారు. ఎవరైనా మృతుడి సంబంధికులు ఉంటే ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనాదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ ఆంజనేయులు

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పటాన్‌చెరు ట్రాఫిక్ ఎస్‌ఐ ఆంజనేయులు అన్నారు. బుధవారం పటాన్‌చెరు బస్టాండ్ సమీపంలో వాహన దారులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి రోజూ వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. వాహనదారులు సెల్ ఫోన్ మాట్లాడుతూ, రాంగ్‌రూట్‌లో వాహనాలు నడపొద్దని హెచ్చరించారు.

కొనసాగుతున్న సమ్మె

సిద్దిపేటరూరల్: జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలని సమ్మె కొనసాగిస్తున్నారు. వారు చేస్తున్న సమ్మెకు పలు పార్టీలకు చెందిన నాయకులు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ప్రభుత్వం నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. న్యాయబద్ధమైన డిమాండ్‌కు తమ పూర్తి మద్దతు ఉంటుందని పలు పార్టీల నాయకులు పేర్కొన్నారు. నెంటూర్ సర్పంచ్ రంగారెడ్డి, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

‘ఉగ్రం’ ఆలోచింపజేస్తుంది

- మ్యాన్ మిస్సింగ్ కథతో సినిమా
- కథా రచయిత తూము వెంకట్
- ఇకపై జహీరాబాద్‌లో షూటింగ్‌లు



నరేశ్‌కు సన్నివేశాన్ని వివరిస్తున్న తూము వెంకట్ (ఫైల్)

జహీరాబాద్: ఉగ్రం సినిమా చాలా విషయాల్లో అందరినీ ఆలోచింపజేస్తుందని సినిమా కథా రచయిత, జహీరాబాద్ వాసి తూము వెంకట్ అన్నారు. జహీరాబాద్‌కు వచ్చిన సందర్భంగా సినిమా విశేషాలను వెల్లడించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రేపు ఉగ్రం సినిమా విడుదల కాబోతోందన్నారు. ప్రతీ గంటకు దేశంలో 80 మంది వరకు అదృశ్యం అవుతున్నారని, వీరిలో 51 శాతం మంది ఆచూకీ లభిస్తోందన్నారు. మిగతా వారు ఏమవుతున్నారో తెలియడంలేదన్నారు. దీని ఆధారంగాకే కథ రాశానన్నారు. అల్లరి నరేష్ ఈ సినిమాలో ఉగ్రరూపం చూస్తారన్నారు. ప్రేక్షకులు సినిమా చూసి థియేట్ నుంచి బయటకు వచ్చాక మర్చిపోయే సినిమా కాదన్నారు. అనేక విషయాల్లో వెంటాడుతూ ఆలోచింపజేస్తుందన్నారు. సినిమాకు విజయ్ కనకమేడల దర్శకత్వం వహించారని, సాహూ గారపాటి, హరీష్‌పెద్దిలు నిర్మాతలుగా ఉన్నారన్నారు. హీరోయిన్‌గా మిర్నా నటించారన్నారు. తాను రాసిన కథతో వచ్చిన నాంది సినిమా యూనిట్ ఈ సినిమాకు పనిచేసిందన్నారు.

సినిమా రంగంపై ఉన్న మక్కువతోనే..

తనకు సినిమా రంగంపై ఉన్న మక్కువతోనే ఈ రంగంలోకి అడుగుపెట్టినట్లు తూము వెంకట్ చెప్పారు. కథా రచయితగా నాంది సినిమాతో రంగ ప్రవేశం చేశానని, ఉగ్రం తనకు రెండో సినిమా అన్నారు. ఈ రెండు సినిమాలకు హీరోగా అల్లరి నరేశ్ చేశారన్నారు. మూడో కథతో త్వరలో రాబోతున్నట్లు, ఈ కథకు నాగచైతన్యను హీరోగా అనుకుంటున్నట్లు వెల్లడించారు. 2012లో పవన్ కళ్యాణ్ నటించిన గబ్బర్‌సింగ్ సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశానని, పరుచూరి బ్రదర్స్‌తో కలిసి అసిస్టెంట్ కథారచయితగా చేసినట్లు చెప్పారు. ఇక ముందు చేసే సినిమాల షూ టింగ్ జహీరాబాద్‌లో జరిపేలా చూస్తానన్నారు.

జహీరాబాద్‌లోనే విద్యాభ్యాసం



తూము వెంకట్

తన ప్రాథమిక విద్యాభ్యాసం అంతా జహీరాబాద్‌లోనే చేసినట్లు తూము వెంకట్ తెలిపారు. జహీరాబాద్‌లోని దత్త గిరి కాలనీకి చెందిన తాను 7వ తరగతి వరకు శ్రీ సరస్వతీ శిశు మందిరంలో, 8 నుంచి 10వ తరగతి వరకు ఆదర్శపాఠశాలలో చదువుకున్నట్లు వివరించారు. ఉన్నత చదువులు హైదరాబాద్‌లో పూర్తి చేశానన్నారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

- రూ.2.5లక్షల నగదు, బంగారు ఆభరణాలు అపహరణ
- అనుమానితులపై బాధితుడి ఫిర్యాదు



తాళం పగులగొట్టిన దృశ్యం

జోగిపేట(అందోల్): ఇంటి తాళం పగులగొట్టి పట్టపగలే ఓ ఇంట్లో చోరీ చేసిన సంఘటన అందోల్ మండలం రాంసానిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..మంగళవారం గ్రామంలో ఎల్లమ్మ దేవాలయ భవనానికి స్లాబ్ వేసే పనిలో భాగంగా ప్రతీ ఇంటి నుంచి ఒకరు గీత కార్మిక కుటుంబానికి చెందిన సభ్యులు తప్పనిసరిగా ఉండాలని సంఘం పెద్దలు నిర్ణయించారు. దీంతో మల్లేశంగౌడ్ మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో ఇంటికెళ్లి భోజనం చేసినంతరం భార్యను కల్లు విక్రయించడానికి దింపేసి ఆయన స్లాబ్ నిర్మాణ పనుల వద్దకు వెళ్లాడు. స్లాబ్ పూర్తయిన తర్వాత సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో తన భార్యను తీసుకొని ఇంటికి చేరుకున్నారు. అక్కడ ఇంటికి తాళం తీసి ఉండడాన్ని వారు గమనించారు. లోపలికి వెళ్లి చూసే సరికి బీరువా తెరచి, అందులోని బట్టలు చిందర వందరగా పడేశారు. వెంటనే తాము దాచిన డబ్బు, బంగారాన్ని చూసుకున్నారు. అవి అందులో కనిపించలేదు. వాటిని ఎవరో దొంగిలించినట్లుగా నిర్ధారించుకున్నారు. సుమారు రూ.2.50లక్షల నగదు, మూడున్నర తులాల పుస్తెల తాడు, 20 తులాల వెండి పట్టీలు, 4 మాసాల బంగారు ఉంగరం తీసుకెళ్లినట్లుగా వారు ఫిర్యాదు చేశారు. పోలీసులు బుధవారం సంఘటన స్థలాన్ని పరిశీలించి బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

లారీ ఢీ కొని యువకుడి మృతి



నరేశ్(ఫైల్)

నర్సాపూర్ రూరల్: బైకును లారీ ఢీ కొన్న ఘటనలో 20 ఏళ్ల యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం నర్సాపూర్-సంగారెడ్డి రహదారిలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ సమీపంలో చోటుచేసుకుంది. నర్సాపూర్ ఎస్‌ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం..నర్సాపూర్ మండలం గూడెంగడ్డ గ్రామానికి చెందిన అవంచ రమేష్ కుమారుడు అవంచ నరేష్ (20) అదే గ్రామానికి చెందిన నాగరాజులు కలిసి బైక్‌పై నర్సాపూర్ నుంచి గూడెంగడ్డకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న లారీ బైక్‌ను ఢీ కొట్టింది. వెనకాల కూర్చున్న నరేష్ అక్కడికక్కడే మృతి చెందగా బైక్ నడుపుతున్న నాగరాజుకు స్వల్పగాయాలయ్యాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లారీ బోల్తా..

తప్పిన పెను ప్రమాదం



వాగులో పడిపోయిన ధాన్యం బస్తాలు

మెదక్ రూరల్: కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి వంతెనపై బోల్తా పడిన ఘటన మెదక్ మండలం మల్కాపూర్ శివారులో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మల్కాపూర్ కొనుగోలు కేంద్రం నుంచి రైతులకు సంబంధించిన వరి ధాన్యం బస్తాల లోడ్‌ను మెదక్‌లోని మిల్లుకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యలో హల్దీ వాగు బ్రిడ్జిపై లారీ అదుపు తప్పి ఒక్కసారిగా పల్టీ కొట్టింది. ఈ ఘటనలో లారీలో ఉన్న ధాన్యం బస్తాలు వాగులో పడిపోయాయి. ఆ సమయంలో ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పిందన్నారు. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే లారీ బోల్తా పడిందని స్థానికులు వాపోతున్నారు.

దళితుల సంక్షేమానికి కృషి

మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

ములుగు(గజ్వేల్): దళితుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ములుగు మండలం కొత్తూరులో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని బుధవారం ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులు చైతన్యవంతులై చదువుతో పాటు రాజకీయంగా రాణించాలన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు సముచిత గౌరవం ఇస్తూ హైదరాబాద్‌లో 125అడుగుల విగ్రహాన్ని ఆవిష్కరించుకున్నామన్నారు. సచివాలయానికి ఆ మహనీయుని పేరు పెట్టి దేశానికే ఆదర్శంగా నిలిచామన్నారు. ఈ కార్యక్రమంలో వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, బీఆర్‌ఎస్ యువనాయకులు మహ్మద్ జుబేర్‌పాషా, జెడ్పీటీసీ అర్జున్‌గౌడ్, వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ నరేష్‌గౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ రంగారెడ్డి, సురేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన రామచంద్రాపురం పట్టణంలోని డైమండ్ చౌరస్తా వద్ద బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం...ఆమీన్‌పూర్ మండలం కృష్టారెడ్డి పేటకు చెందిన సోమిరెడ్డి(59) పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లోని పెన్నార్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మధ్యాహ్నం పనినిమిత్తం కిష్టారెడ్డి పేట నుంచి రామచంద్రాపురానికి వస్తున్నాడు. డైమండ్ చౌరస్తా వద్ద రాగానే డీసీఎం స్కూటీని ఢీ కొట్టింది. దీంతో సోమిరెడ్డి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు.

పురుగుల మందు తాగి..

పుల్‌కల్(అందోల్): పురుగుల మందు తాగి యువకుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకార..పుల్‌కల్‌కు చెందిన బెస్త సాయికుమార్(26) మంగళవారం గ్రామంలో జరుగుతున్న జాతరలో పాల్గొని మద్యం సేవించాడు. మద్యం మత్తులో పురుగుల మందు కూడా సేవించాడు. అనంతరం ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం చేరవేశాడు. కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

గజ్వేల్‌రూరల్: రాష్ట్రస్థాయి జిజ్ఞాస 2023 పోటీల్లో గజ్వేల్‌లోని ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గణపతిరావు పేర్కొన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో జరిగిన జిజ్ఞాస పోటీలకు ‘గజ్వేల్ మండలంలో ప్రభుత్వ ప్రాథమిక విద్య ఒక పరిశీలన’, ‘బోవిన్ ఎముక ద్వారా నీటి డి ఫ్లోరిడేషన్’ అనే అంశాలపై విద్యార్థులు ప్రజెంటేషన్ ఇచ్చినట్లు తెలిపారు. ఈ రెండు ప్రాజెక్టులు జిజ్ఞాస పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయన్నారు. అనంతరం విద్యార్థులను కళాశాలలోని రాజనీతి శాస్త్ర విభాగ పర్యవేక్షకులు డాక్టర్ పెద్దిరాజు, రసాయనశాస్త్ర విభాగ పర్యవేక్షకులు ఎం. బాల్‌రాజు, తెలంగాణ కళాశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, సిటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలభాస్కర్, అకడమిక్ సెల్ ఆఫీసర్ డాక్టర్ కుమారస్వామిలు అభినందించారు.

మల్లన్న సాగర్ కాలువలో మునిగి యువకుడి మృతి



రాజు మృతదేహం

కొండపాక(గజ్వేల్): మల్లన్న సాగర్ కాలువలో మునిగి యువకుడు మృతి చెందిన సంఘటన కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొడకండ్ల గ్రామానికి చెందిన పూస రాములుకు మల్లన్న సాగర్ కాలువ ప్రక్కన 2 ఎకరాల భూమి ఉంది. వ్యవసాయానికి నీరు లేనందునా మల్లన్న సాగర్ కాలువలోనే మోటార్‌తో నీటిని పొలానికి మళ్లించేవాడు. ఈ క్రమంలో కాలువలో ఉంచిన మోటార్ నుంచి నీరు తక్కువగా వస్తుండడంతో పైపులో చెత్త తట్టిందని భావించాడు. స్నేహితుడు కర్రోళ్ల మధును వెంటబెట్టుకొని రాజు మంగళవారం సాయంత్రం 6 గంటలకు కాలువలోకి దిగాడు. పైపు అడుగు భాగంలో చెత్తను తీసివేసే క్రమంలో ఊపిరాడక మృతి చెందాడు. భయానికి గురైన మధు ఈ విషయాన్ని మృతుని కుటుంబీకులకు చెప్పలేదు. బుధవారం ఉదయం కుటుంబీకులకు తెలపడంతో కాలువలోకి దిగి చూడగా రాజు నీటిలో మునిగి మృతి చెందినట్లు గుర్తించారు. మృతుని తండ్రి రాములు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ పుష్పరాజ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోగొట్టుకున్న ఫోన్ల అందజేత



సిద్దిపేటకమాన్: సెల్‌ఫోన్ అందజేస్తున్న ఏసీపీ దేవారెడ్డి, సీఐ భానుప్రకాశ్

చిన్నకోడూరు(సిద్దిపేట): పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను సీఈఐఆర్‌తో గుర్తించి బాధితుడికి అందజేశారు. సిద్దిపేటకు చెందిన శ్రీనివాస్ తన మొబైల్ ఫోన్‌ను మార్చి 30న చిన్నకోడూరులో పోగొట్టుకున్నాడు. సీఈఐఆర్‌లో ఫోన్ వివరాలను నమోదు చేశాడు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఫోన్ దొరికిన వ్యక్తి నుంచి వివరాలు సేకరించి తిరిగి ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. బాధితుడు శ్రీనివాస్‌కు బుధవారం ఫోన్ అందజేసినట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు.

మునిపల్లిలో..

మునిపల్లి(అందోల్): మండలంలోని పెద్దలోడి గ్రామానికి చెందిన కలాల్ నరేందర్‌గౌడ్‌కు పోగొట్టుకున్న ఫోన్‌ను బుదేరా పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ రాజశేఖర్ బుధవారం అందజేశారు. 2022, ఆగస్టు 15న పెద్దలోడి గ్రామంలో హనుమాన్ మందిరం వద్ద ఫోన్ పోయినట్టు, అనంతరం ఆన్‌లైన్ మీ సేవలో దరఖాస్తు చేసుకున్నట్టు బాధితుడు పేర్కొన్నాడు. సీఈఐఆర్‌తో ఫోన్‌ను రికవరీ చేసి బాధితునికి అందజేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

సిద్దిపేటకమాన్‌లో..

సిద్దిపేటకమాన్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్‌తో గుర్తించి ఏసీపీ దేవారెడ్డి, త్రీటౌన్ సీఐ భానుప్రకాష్ బాధితుడికి అందజేశారు. సిద్దిపేట ఏసీపీ దేవారెడ్డి, సీఐ భానుప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణానికి చెందిన శివనాయక్ కొద్ది రోజుల క్రితం పట్టణంలో ద్విచక్ర వాహనంపై వెలుతున్న క్రమంలో తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. బాధితుడు పోలీసులను ఆశ్రయించగా సీఈఐఆర్ యాప్‌లో ఫోన్ వివరాలు నమోదు చేసి, బ్లాక్ చేశాడు. అనంతరం పోలీసులు ఫోన్‌ను రికవరీ చేశారు. అనంతరం సెల్‌ఫోన్‌ను బాధితుడికి ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ దేవారెడ్డి, త్రీటౌన్ సీఐ భానుప్రకాష్ అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ దేవారెడ్డి, సీఐ భానుప్రకాష్ మాట్లాడుతూ..ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ పోర్టల్‌ను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు.

రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బాధితుడుకి రామచంద్రాపురం పోలీసులు అందజేశారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్‌లింగం మాట్లాడుతూ గత నెల 30వ తేదీన బాధితుడు లింగంపల్లిలోని పెట్రోల్ బంకు వద్ద ఫోన్ పోగొట్టుకున్నాడు. పోలీసులు సీఈఐఆర్‌తో రికవరీ చేసి బాధితునికి అప్పగించారు.

చిన్నశంకరంపేటలో..

చిన్నశంకరంపేట(మెదక్): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్‌తో గుర్తించి బాధితునికి అప్పగించినట్లు చిన్నశంకరంపేట ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు. బుధవారం చిన్నశంకరంపేట మండలం చందాపూర్ గ్రామానికి చెందిన అరిగే బాగులు గతంలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. దీన్ని రికవరీ చేసి పోలీసులు అందజేశారు.

సైబర్ వలలో చిక్కి..

రోజురోజుకు సైబర్ వలలో చిక్కుకుంటున్న వారి సంఖ్య పెరుగుతునే ఉంది. పోలీసులు జాగ్రత్తలు చెప్పినప్పటికీ సైబర్ ఆగడాలు కొనసాగుతునే ఉన్నాయి. సిద్దిపేట, సంగారెడ్డి పరిధిలో పలువురి నుంచి పెద్ద మొత్తంలో నగదు కాజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి..

లోన్ మంజూరైందంటూ

సిద్దిపేటకమాన్: లోన్ మంజూరైందంటూ చార్జీల నిమిత్తం డబ్బులు పంపించి సైబర్ మోసానికి గురైన సంఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. సిద్దిపేట సీపీ శ్వేత తెలిపిన వివరాల ప్రకారం..సిద్దిపేట పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థ నుంచి మాట్లాడుతున్నానని నమ్మబలికారు. మీకు రూ.3లక్షల లోన్ మంజూరైందని ఆ డబ్బులు ఖాతాలో జమ చేయాలంటే ముందుగా ప్రాసెసింగ్ చార్జీల నిమిత్తం కొంత డబ్బులు చెల్లించాలని గుర్తు తెలియని వ్యక్తి బాధితున్ని నమ్మించాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు గుర్తు తెలియని వ్యక్తి సూచించిన నెంబర్‌కు ఆన్‌లైన్‌లో రూ.45,570లు పంపించిన అనంతరం మోసపోయినట్టుగా గుర్తించాడు. వెంటనే ఘటనపై బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు.



ఉద్యోగం పేరిట

గౌరారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తికి ఇన్‌స్టాగామ్‌లో గుర్తు తెలియని వ్యక్తి పరిచయం అయ్యాడు. ఉద్యోగం ఉందని తన వివరాలు నమోదు చేసుకోవాలని అందుకుగాను గుర్తు తెలియని వ్యక్తి ఓ లింకును పంపాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు లింకు ద్వారా టెలిగ్రామ్ గ్రూప్‌లో లాగిన్ అయ్యాడు. గుర్తు తెలియని వ్యక్తి సూచించిన విధంగా తన సెల్‌ఫోన్‌కు వచ్చిన ఓటీపీ, ఇతర మెసేజ్ వివరాలు సైబర్ నేరస్థుడికి తెలియజేశాడు. బాధితుడి ఖాతా నుంచి రూ.57,999లు విత్‌డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో తను మోసపోయినట్టు గుర్తించి వెంటనే జాతీయ హెల్ప్‌లైన నెంబర్‌కు ఫిర్యాదు చేశాడు.

ఫేస్‌బుక్ ఐడీతో..

సిద్దిపేట పట్టణానికి చెందిన మరో వ్యక్తికి ఫేస్‌బుక్ ఫేక్ ఐడీ ద్వారా ఇయర్ బర్డ్స్ వచ్చాయని గుర్తు తెలియని వ్యక్తి ఓ లింకును పంపించాడు. బాధితుడు ఆ లింకును ఓపెన్ చేయగానే తన సెల్‌ఫోన్‌కు వచ్చిన ఓటీపీ వివరాలను అందులో నమోదు చేశాడు. దీంతో బాధితుడి ఖాతా నుంచి రూ.15,307 డెబిట్ అయినట్లు గుర్తించాడు. వెంటనే బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫిర్యాదు చేశాడు.

ట్రేడింగ్ యాప్‌లో..

సిద్దిపేట పట్టణానికి చెందిన ఒక వ్యక్తి ట్రేడింగ్‌కు సంబంధించిన యాప్‌లో పెట్టుబడి పెడితే పెట్టిన డబ్బులు రెట్టింపు అవుతాయని ఆన్‌లైన్‌లో తెలుసుకున్నాడు. ఆ యాప్‌లో రూ.12వేలు పెట్టుబడిగా పెట్టాడు. అనంతరం ఫోన్ చేయగా ఆ నెంబర్ స్విచ్ ఆఫ్ రావడంతో సైబర్ మోసానికి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పాత స్నేహితుడిగా నమ్మబలికి..

గజ్వేల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి పాత స్నేహితుడిగా నమ్మించాడు. అతడికి అత్యవసరంగా డబ్బులు అవసరం ఉన్నాయని తెలపడంతో ఆ మాటలు నమ్మిన బాధితుడు ఆన్‌లైన్‌లో రూ.2వేలు పంపించాడు. అనుమానంతో ఆ నెంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో బాధితుడు మోసపోయినట్టుగా గుర్తించాడు. జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫిర్యాదు చేశాడు.

రెట్టింపు నగదు ఇస్తామని..

పటాన్‌చెరు టౌన్: రెట్టింపు డబ్బు ఇస్తామని ఆశ చూపి రూ.3లక్షల 67వేలు ఒకరి నుంచి, రూ.87వేలు మరొకరినుంచి కాజేసిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..అమీన్ పూర్‌కి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి ఏప్రిల్ 13వ తేదీన వాట్సప్ ద్వారా పార్ట్ టైం జాబ్ ఉందని లింక్ వచ్చింది. దీంతో బాధితుడు వివరాలను నమోదు చేశాడు. ఈ క్రమంలో తన దగ్గర ఉన్న నగదును పలు దఫాలుగా ఇన్వెస్ట్ చేస్తూ టాస్క్‌లు పూర్తి చేస్తూ వచ్చాడు. చివరకు తను పెట్టిన రూ.3 లక్షల 67వేలతోపాటు రెట్టింపు నగదు ఇవ్వాలని కోరగా స్పందన రాలేదు. దీంతో బాధితుడు తను మోసపోయినట్లు గుర్తించి అమీన్ పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

మరో సంఘటనలో..

అమీన్ పూర్‌కి చెందిన మరో బాధితుడికి ఏప్రిల్ 23వ తేదీన పార్ట్ టైం ఉద్యోగం పేరిట మెసేజ్ వచ్చింది. దీంతో ఆ బాధితుడు వివరాలను నమోదు చేశాడు. నగదు ఇన్వెస్ట్ చేస్తూ టాస్క్‌లు పూర్తయిన అనంతరం పెట్టిన నగదు రూ.1లక్ష 81వేలతో పాటు రెట్టింపైన నగదు ఇవ్వాలని కోరడంతో గుర్తు తెలియని వ్యక్తి స్పందించలేదు. దీంతో బాధితుడు మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేశాడు.

రూ.16లక్షలు లోన్ ఇప్పిస్తామని..

పటాన్‌చెరు టౌన్: రూ.16 లక్షల పర్సనల్ లోన్ ఇప్పిస్తామని ఓ వ్యక్తిని మోసగించి అతని వద్ద నుంచి రూ.83,374లు కాజేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తికి ఏప్రిల్ 15వ తేదీన గూగుల్‌లో పర్సనల్ లోన్ రూ.16 లక్షలు ఇప్పిస్తామని నమ్మబలికారు. అది నమ్మిన బాధితుడు తన వివరాలను నమోదు చేశాడు. లోన్ ప్రాసెస్ కోసం ముందస్తుగా కొంత నగదు చెల్లించాలని తెలిపారు.

పలు దఫాలుగా బాధితుని నుంచి మొత్తం రూ.83,374లు కట్టించుకున్నారు. ఈ క్రమంలో అనుమానం వచ్చిన బాధితుడు లోన్ ఎప్పుడు ఇప్పిస్తారని అడగడంతో గుర్తుతెలియని వ్యక్తి స్పందించలేదు. దీంతో తను మోసపోయినట్టు గుర్తించి పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

పార్ట్ టైం ఉద్యోగం ఉందని..

పటాన్‌చెరు పట్టణంలోని జేపీ కాలనీకి చెందిన షరీఫ్‌కు ఏప్రిల్ 25వ తేదీన పార్ట్ టైం ఉద్యోగం ఉందని మెసేజ్ వచ్చింది. బాధితుడు ఆ మెసేజ్‌కి స్పందించి తన వివరాలను నమోదు చేశాడు. ముందుగా రూ.2వేలు చెల్లించి ఆన్‌లైన్‌లో ఇచ్చిన టాస్క్‌ను పూర్తి చేశాడు. దీంతో బాధితుడికి తిరిగి రూ.2,600లు చెల్లించారు. దీన్ని నమ్మిన బాధితుడు పలు దఫాలుగా చెల్లిస్తూ ఇచ్చిన టాస్క్‌లు పూర్తిచేశాడు. మొత్తం రూ.107,600లు చెల్లించాడు. తను చెల్లించిన నగదుతో పాటు రెట్టింపు నగదు ఇవ్వాలని బాధితుడు కోరాగా గుర్తుతెలియని వ్యక్తి స్పందించలేదు. దీంతో బాధితుడు మోసపోయినట్టు గుర్తించి సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేశాడు.